క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



బాన్సువాడ రూరల్: ఎరువులు, పురుగుల మందు దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్య లక్ష్మి సూచించారు. శనివారం ఆమె కోనాపూర్, హన్మాజీపేట్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఏవో సుధాకర్‌తో కలిసి తనిఖీ చేశారు. స్టాక్‌బోర్డుతో పాటు ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. యూరియా అమ్మకాలకు ఇతర మందులతో ముడి పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. రైతుల పంటలకు అవసరమైన క్రిమిసంహారక మందులు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు.

పంట వివరాల నమోదు

బాన్సువాడ రూరల్: మండలంలో పంటల సాగు వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ఏవో సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని గట్టుమీది గ్రామాల్లో ఏఈవో మీన తో కలిసి పంటల వివరాల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి పంపాలి



నాగిరెడ్డిపేట: చిన్నారులను క్రమం తప్పకుండా ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరీబాయి సూచించారు. మండలంలోని మహాదేవునిగడ్డ తండాలో గల అంగన్‌వాడీకేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. కొంతమంది చిన్నారులు రెగ్యూలర్‌గా కేంద్రానికి రావడం లేదని తెలుసుకున్న ఆమె తండాలోని చిన్నారుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. చిన్నారులను క్రమం తప్పకుండా ప్రతిరోజూ కేంద్రానికి పంపాలని అవగాహన కల్పించారు. అనంతరం ఎర్రకుంటతండాలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు రేణుక, స్నేహ ఉన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

రామారెడ్డి: మండలంలోని మద్దికుంటలో మండల పరిషత్ నిధులతో శనివారం ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎంపీపీ దశరథ్‌రెడ్డి, సర్పంచ్ రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎంపీటీసీ రాజేందర్, కార్యదర్శి హరిలత, సాయిరెడ్డి, తోట లింగం, రాజాగౌడ్ పాల్గొన్నారు.

క్రషర్‌ను తొలగించాలి



ఎల్లారెడ్డి: మండలంలోని వెలుట్లపేట శివారులో ఏర్పాటు చేసిన క్రషర్‌ను తొలగించాలని గ్రామస్తులు శనివారం తహసీల్దార్ మహేందర్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. క్రషర్‌తో కాలుష్యం ఏర్పడుతోందని, క్రషర్‌లో బాంబులు పేల్చడం వల్ల ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని విన్నవించారు.

సైబర్ నేరాలపై అవగాహన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ సెల్ ఇన్‌చార్జి సీఐ ప్రసాద్ మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైన బాధితులు వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరూ కూడా డబ్బులను, బహుమతులను, ఉద్యోగా లను ఉచితంగా ఇవ్వరనే విషయాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని వివరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డి అర్బన్: తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్(టీఎస్ మేసా) క్యా లెండర్‌ను శనివారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించారు. మేసా జిల్లా అధ్యక్షుడు ఎంఎ బషీర్, ప్రధాన కార్యదర్శి రఫిక్, జమీల్, కరీం, ఇర్ఫాన్, బదీరుద్దీన్,మెయిస్, ముజాహిద్ పాల్గొన్నారు.

వైన్ షాప్‌ను తొలగించాలి

కామారెడ్డి టౌన్: మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రైవేట్ పాఠశాల పక్కన ఉన్న వైన్ షాపును తొలగించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు ఎక్సైజ్ అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. సభావత్ వినోద్ నాయక్, నరేష్, నగేష్, చందు, ఫుల్ సింగ్, దేవిసింగ్, సంతోష్ పాల్గొన్నారు.

బీడీ పింఛన్ పెంచాలి

మాచారెడ్డి: బీడీ కార్మికులకు పింఛన్ పెంచాలని నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాచారెడ్డిలో మాట్లాడారు. కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్ ఇవ్వాలన్నారు. లక్ష్మణ్, లక్ష్మి, దేవవ్వ, ఎల్లవ్వ, భూదవ్వ ఉన్నారు.

ఆలయాలు ముస్తాబు

- 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో..
- జిల్లాలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం

శతాబ్దాల కల సాకారం అవుతోంది. అయోధ్య మందిరంలో రామయ్య కొలువు దీరనున్నాడు. ఈ నేపథ్యంలో రామభక్తులు పులకరిస్తున్నారు. ఇళ్లపై కాషాయ జెండాలు ఎగురవేస్తున్నారు. సకల గుణాభిరాముడి పేరును ఇంటి గోడలపై రాస్తున్నారు. దీంతో ప్రతి ఊరు భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. జైశ్రీరామ్ నామస్మరణతో పల్లెలు మారుమోగుతున్నాయి. రాములోరి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.



ముస్తాబైన పిట్లంలోని రామాలయం



మద్నూర్ రామ మందిరంలో ఏర్పాట్లు



భిక్కనూరులో కాషాయ జెండాల పంపిణీ..

భిక్కనూరు: భిక్కనూరులో సోమవారం శ్రీరామ కార్యం నిర్వహించేందుకు శ్రీరామదండు ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా మండల కేంద్రంలో ప్రతి ఇంటిపై కాషాయం జెండాను ఎగురవేశారు. గోడలపై జై శ్రీరాం అంటూ పేయింటింగ్‌లు వేశారు. ఇంటింటా రాములోరి అక్షింతలను పంపిణి చేశారు. సోమవారం శ్రీరామ కార్యం కోసం అంగడి బజారులో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి, రెండు వేల మంది చూసే విధంగా చర్యలు చేపడుతున్నారు. మండల కేంద్రంలోని హన్‌మాన్ ఆలయాల్లో స్వామివారికి సిందూర పూజలు అభిషేకాలు నిర్వహించనున్నారు. స్థానిక నగరేశ్వరాలయం నుంచి సీతారాముల విగ్రహాలను ఊరేగించి అంగడి బజార్‌లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు శ్రీరామ దండు ప్రతినిధులు తెలిపారు.

పిట్లం: పిట్లంలోని రామాలయంలో సోమవారం శ్రీ రామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ట్రస్ట్ సభ్యుడు కోట రాజులు పేర్కొన్నారు. ఆలయంలో అభిషేకం, అర్చన, నగర సంకీర్తన, సీతారాముల కల్యాణం చేయనున్నారు. అదే విధంగా మండలంలోని పద్మశాలి, ఆర్యవైశ్య, విశ్వబ్రహ్మణ సంఘాల సభ్యులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మద్నూర్: అయోధ్యలోని రాములోరి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ఈ నెల 22వ తేదీన మండల కేంద్రంలోని రామ మందిరంలో ప్రత్యేక పూజలకోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. విద్యార్థులు, యువకులు మద్నూర్‌లో జైశ్రీరాం అంటు గెడలకు పెయింటింగ్ వేశారు. రామ మందిరంలో ప్రత్యేక పూజల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్చకులు వెంకట్ మహారాజ్ తెలిపారు. ఈ నెల 22వ తేదీన ఆలయంలో అన్నదానం భజన, కీర్తన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఎల్లారెడ్డి/దోమకొండ/రామారెడ్డి: ఎల్లారెడ్డిలోని రామాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానం నిర్వహించనున్నారు. దోమకొండ శివ రాంమందిర్ ఆలయంలో శ్రీసీతారాముల విగ్రహానికి పూజలు అన్నదానం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రామారెడ్డిలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

తాడ్వాయి/మాచారెడ్డి: తాడ్వాయి మండలం కన్‌కల్‌లో రామాలయంలో సోమవారం ఊరేగింపు, అన్నదానం, దీపాలంకరణ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మాచారెడ్డి మండలం పాలాన్‌పల్లి రామాలయం, మాచారెడ్డి చౌరస్తాలో శ్రీ వీరహన్మాన్ వేంకటేశ్వర ఆలయం, లచ్చాపేట శ్రీ విఠలేశ్వరాలయంలో సంప్రోక్షణతో పాటు ప్రత్యేక పూజలు, శ్రీ రామ హోమ క్రతువులు చేయనున్నారు.

ఇంటి గోడలపై జైశ్రీరాం



సదాశివనగర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం ప్రతి ఇంటి గోడలకు కొంతమంది యువకులు జైశ్రీరాం పెయింటింగ్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల 22న జరిగే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. జైపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గాండ్ల రమేశ్, నారాయణ, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ప్రతి ఇంట్లో పండుగ కావాలి'



కామారెడ్డి అర్బన్: దేశంలో ప్రతి ఒక్కరు రామ రాజ్యం కావాలని ఆకాంక్షించే వారేనని, అలాంటి శ్రీరాముని జన్మస్థలంలో ఆయన విగ్రహం ప్రతిష్ఠాపన ప్రతి ఇంట్లో ఒక పండుగ కావాలని ఆచార్య సత్యమిత్ర అన్నారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా కామారెడ్డి ఆర్యసమాజ్ మందిరంలో మూడు రోజుల రామకథ ప్రవచనం కార్యక్రమం శనివారం సాయంత్రం ప్రారంభమైంది. ఆర్యసమాజ్ అధ్యక్షుడు కంకణాల కిషన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

నస్రుల్లాబాద్: ప్రజలు కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల్లో అందించే పథకాలను వినియోగించుకోవాలని ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంకు మేనేజర్, నోడల్ ఆఫీసర్ రాహుల్ అన్నారు. శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా రాముల గుట్ట తండా, నాచుపల్లి గ్రామాల్లో అవగాహన కల్పించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి హన్మండ్లు, సర్పంచ్ గోపాల్, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.



రాములగుట్ట తండాలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారి

పోస్టల్ పథకాలపై అవగాహన

మద్నూర్: తపాల శాఖ ప్రజల కోసం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా తపాలా అధికారి జనార్దన్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని తపాలశాఖ కార్యాలయ ఆవరణలో శనివారం మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ శాఖలకు చెందిన తపాల సిబ్బందికి అవగాహన కల్పించారు. మండలంలోని లచ్చన్ గ్రామానికి చెందిన దేవిదాస్‌కు ప్రమాదభీమా పథకం కింద మంజూరైన రూ. 62 వేల చెక్కును అందజేశారు. అధికారులు వేణు, పవన్‌రెడ్డి, గంగాధర్, గోపాల్, షకీల్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.10కోట్ల నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో శనివారం నాగిరెడ్డిపేట మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఎంపీపీ రాజ్‌దాస్, కో–ఆప్షన్ సభ్యుడు షాహెద్‌పాష, సుధాకర్, లక్ష్మణ్, ఇమామ్, నర్సింహారెడ్డి, ఫారూక్, సురేందర్‌గౌడ్, పర్వతరావు పాల్గొన్నారు.

నవోదయ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని నవోదయ ప్రవేశ పరీక్ష కేంద్రాలను ఆర్డీవో మన్నే ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్ కుమార్ శనివారం పరిశీలించారు. జీవధాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలను ఆర్డీవో పరిశీలించారు.

ప్రశాంతంగా పరీక్ష

బాన్సువాడ: నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా కొనసాగింది. బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోనా బాన్సువాడ, బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

565 మంది విద్యార్థులకు 463 మంది పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



లింగంపేట: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కామారెడ్డి ఆర్టీఏ విక్రమ్ సూచించారు. శనివారం ఆయన లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రస్తుతం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు నడుస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. విద్యార్థులు మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. ఎస్సై ప్రభాకర్, ఏఎస్సై ప్రకాష్, స్వామిగౌడ్, అమీర్, హెచ్ఎం వహీద్‌సిద్దిఖీ, గంగాధర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

తాడ్వాయి: బాల్య వివాహాలను అరికట్టాలని మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు శిరీష అన్నారు. తాడ్వాయిలో శనివారం బేటీ బచావో బేటీపడావో కార్యక్రమంలో భాగంగా మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. సూపర్‌వైజర్ శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్: మండలంలోని దుర్కిలో శనివారం మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణి మాట్లాడుతూ మహిళల హక్కులు, విద్య బాల్యవివాహాలు, సఖీ సర్వీసెస్ గురించి వివరించారు. ఎంపీటీసీ కుమ్మరి నారాయణ, ఉప సర్పంచ్ ఖాదర్, ఏఎన్ఎం ఉమ పాల్గొన్నారు.



తాడ్వాయిలో అవగాహన కల్పిస్తున్న శిరీష

సంక్షిప్తం

22న మాంసం దుకాణాల బంద్

భిక్కనూరు: అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా భిక్కనూరులో సోమవారం మాంసం దుకాణాలను మూసి ఉంచాలని నిర్ణయించినట్లు సర్పంచ్ తున్కి వేణు తెలిపారు. గ్రామ ప్రజల వినతి మేరకు మాంసం దుకాణాలను మూసివేయాలని నిర్ణయించామన్నారు.

అంగడి స్థలం మార్పు

భిక్కనూరు: భిక్కనూరులో ప్రతి ఆదివారం నిర్వహించే అంగడి స్థలాన్ని 21న భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వద్దకు మార్చినట్లు సర్పంచ్ వేణు తెలిపారు. అంగడిబజారులో సోమవారం శ్రీరామ కార్యక్రమం నిర్వహిస్తున్నందున పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దీంతో అంగడిని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోకి మార్చామన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

నిజాంసాగర్: మండలంలోని 47 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఎస్ఎమ్‌సీ ఎన్నికల నోటిఫికేషన్ శనివారం అధికారులు విడుదల చేశారు. పాఠశాలల వారిగా యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో చైర్మన్ సీటుకు ఆశావహులు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

వేంకటేశ్వరాలయం శుద్ధి

భిక్కనూరు: భిక్కనూరులోని అతి పురాతనమైన శ్రీ వేంకటేశ్వరాలయాన్ని శనివారం శుద్ధి చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. ఉప్పర రమేష్, బల్యాల శ్యామ్‌కుమార్, వెంకటనర్సింలు, ఆకుల ప్రవీణ్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో గెలుపొందిన తాడ్వాయి జట్టు

తాడ్వాయి: కామారెడ్డి శిశుమందిర్ పాఠశాలలో శనివారం జరిగిన వాలీబాల్ పోటీల్లో తాడ్వాయి జట్టు మొదటి స్థానాన్ని సాధించిందని ప్రిన్సిపాల్ సయ్యద్ యూసూఫ్ హుస్సేన్ తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు క్రీడాకారులను అభినందించారు.

వసతులు కల్పించాలి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి శివారు డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కాలనీలో వసతులు కల్పించాలని శనివారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు.

క్రాస్ కంట్రీ రన్నింగ్‌లో పతకాలు



కామారెడ్డి అర్బన్: తెలంగాణ యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన పది కిలోమీటర్ల క్రాస్‌కంట్రీ పరుగు పోటీల్లో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు బి హరిత, అకిత ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలచి స్వర్ణ, రజత పతకాలు సాధించారు. శనివారం సాయంత్రం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు. ఫిబవరి 11న మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో హరిత, అకిత పాల్గొంటారని ఇన్‌చార్జి పీడీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

మాచారెడ్డి: మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీరావులపల్లిలో శ్రమదానం చేశారు. ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రం వద్ద పిచ్చి మొక్కలతో పాటు చెత్తను తొలగించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పద్మ, అధ్యాపకులు శ్రీనివాస్, జయంత్, సాయిబాబా ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన





సదాశివనగర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్, శేఖాపూర్‌లో తహసీల్దార్

సదాశివనగర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్డీవో మన్నె ప్రభాకర్ పరిశీలించారు. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హిమబిందు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని లింగంపల్లికలాన్, అక్కంపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ బి లక్ష్మణ్ పరిశీలించారు. ఓటరు నమోదు కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తుల వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. సీనియర్ అసిస్టెంట్ సాయిలు, బీఎల్‌వోలు వనజ, కృష్ణవేణి ఉన్నారు.

బాన్సువాడ రూరల్: 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి గ్రామాల్లోని బూత్ లెవెల్ అధికారులు చొరవ తీసుకోవాలని బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ఆయా బూత్‌లలో బీఎల్ఓల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కౌంటర్లను పరిశీలించారు. ప్రత్యేక నమోదు కోసం ఆదివారం కూడా ప్రతి గ్రామంలో బూత్‌లెవెల్ అధికారులు ఓటరు జాబితాలో పేరు నమోదు, తొలగింపు, అడ్రస్‌మార్పు ఫారాలతో అందుబాటులో ఉంటారన్నారు. ఈనెల 22 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

మద్నూర్: మండలంలోని శేఖాపూర్, మద్నూర్, మేనూర్, కోడిచిర గ్రామాల్లో శనివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ ముజీబ్ తనిఖీ చేశారు. 18 ఏళ్లు నిండిన వారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ఐ శంకర్, సీనియర్ అసిస్టెంట్ విజయ్, జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, బాలరాజు, రవికుమార్ ఉన్నారు.

నిజాంసాగర్: నిజాంసాగర్, జుక్కల్ మండలాల్లో ఓటరు నమోదు ప్రక్రియను శనివారం తహసీల్దార్లు భిక్షపతి, గంగాసాగర్ పరిశీలించారు.

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ దశరథ్ పరిశీలించారు. సీనియర్ అసిస్టెంట్ పండరి, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలి

నాగిరెడ్డిపేట: మహిళా సంఘాల్లోని సభ్యుల వివరాలను ఈ నెలాఖరులోపు లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని సెర్ప్ డీపీఎం సుధాకర్ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం వీవోఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. జీపీడీపీలో భాగంగా గ్రామీణ పేదరిక తగ్గింపు ప్రణాళిక(వీపీఆర్‌పీ–వీలేజ్ పావర్టీ రివర్షన్ ప్లాన్) పకడ్బందీగా రూపొందించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు బెస్త శాంత, కార్యదర్శి నిరీక్షణ, ఏపీఎం జగదీశ్ కుమార్, సీసీలు నారాయణ, రమేష్,దత్తు, రషీద్, సాయిలు, సుజాత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎం సుధాకర్

జిల్లాలో 71శాతం నమోదు పూర్తి

జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు సంబంధించిన వివరాలను లోకోస్ యాప్‌లో 71శాతం నమోదు చేసినట్లు డీపీఎం సుధాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 15,483 మహిళా సంఘాల్లో 1,51,364మంది సభ్యులుండగా ఇప్పటివరకు 11,049సంఘాల్లోని 55,997 మంది సభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేశామన్నారు. ఈ నెలాఖరులోపు 100శాతం పూర్తి చేస్తామని వివరించారు.

లక్ష మంది రైతులతో సభ్యత్వం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లాలో భారతీయ కిసాన్ సంఘ్‌లో లక్ష మంది రైతుల సభ్యత్వం చేయిస్తామని సంఘ్ క్షేత్ర సంఘటన మంత్రి రాము అన్నారు. శనివారం కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ శివారులోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో భారతీయ కిసాన్ సంఘ్ లేని మండలం ఉండకూడదన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు అన్ని గ్రామాల్లో సభ్యత్వ అభియాన్ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా లక్ష గ్రామాల్లో కోటి పైగా సభ్యత్వాలు చేయడమే లక్ష్యమన్నారు. కిసాన్ సంఘ్‌లో ప్రతి రైతు నాయకుడేనని, ఇందులో ఏక వ్యక్తి నిర్ణయాలు ఉండవన్నారు. రైతులను అన్ని విధాల ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి హాజరైన విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ బాబును రైతులు సన్మానించారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు లొంక వెంకట్ రెడ్డి, పైడి విఠల్ రెడ్డి, అంజయ్య, నగేష్, సాయిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రాము

రేషన్ పంపిణీ సక్రమంగా చేపట్టాలి

కామారెడ్డి రూరల్: రేషన్ డీలర్లు వినియోగదారులకు రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ జనార్దన్ సూచించారు. శనివారం కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో పట్టణ, రూరల్ రేషన్ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. బినామి రేషన్ డీలర్లు ఏవరైనా ఉంటే సమచారం ఇవ్వాలన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ గోపాల్, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లద్దూరి లక్ష్మీపతియాదవ్, మండల అధ్యక్షుడు భూమయ్య, రాజు, యాదయ్య, పున్నం చంద్, చింతల శ్రీనివాస్, పోచయ్య, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ జనార్దన్

గణిత ఫోరం పరీక్ష

కామారెడ్డి టౌన్: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి పరీక్షను జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విజయవంతంగా నిర్వహించారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రకటించారు. ఎంఈవో ఎల్లయ్య, తాడ్వాయి శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటి, రవి, సుష్మ, మంజుల పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



సాక్షి, నెట్‌వర్క్: అయోధ్య పూజిత అక్షింతలను పలు గ్రామాల్లో శనివారం ఇంటింటికి పంపిణీ చేశారు. 22న ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలని అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు సూచించారు.